క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, లోధా, కుందన్‌బాగ్, ఈఎస్ఐ, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నేచర్‌క్యూర్ హాస్పిటల్ ఎదురు లైన్, బల్కంపేట ఎస్‌బీఐ మెయిన్ రోడ్డు, ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఏరియా, కమ్యూనిటీ హాల్ ఎదురు ప్రాంతం, అభిరుచి స్వీట్ హోమ్స్, డీఎస్ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్ఆర్‌టీ పార్క్, టీవీఎస్ షోరూం లేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డీ-మార్ట్ ఎదురు ప్రాంతం. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైట్ హౌస్, మీనా బజార్, బ్రాహ్మణవాడీ, హుడా కాంప్లెక్స్, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, ఉదయ్‌నగర్, ఎస్ఆర్‌టీకాలనీ, హిందూ పబ్లిక్ స్కూల్, హనుమాన్ టెంపుల్, జెక్‌కాలనీ ఇంద్రప్రస్థా బిల్డింగ్, స్ట్రీట్ నెంబర్-1 ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.65, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 90, బజ్జీమిర్చి 80, క్యాప్సికమ్ 67, పచ్చకాకర 45, పందిరి బీర 28, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 90, గింజ చిక్కుడు 65, గోకరకాయ 33, కీర 19, దోసకాయ 25, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 28, మొరంగడ్డ 28, కందగడ్డ 23, సొరకాయ 18, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్న

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలో అవసరమున్న ప్రాంతాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె ఏ-సెక్షన్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, రాను న్న కాలంలో మరిన్ని పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ ఈ కార్యక్రమంలో లింగాని శ్రీను, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, మహ్మద్, వసంత, గౌస్, రవి, గోపి, మల్లేష్, శివ శంకర్, భాగ్య పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



దత్తాత్రేయకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాచమల్ల కుటుంబ సభ్యులు

చిలకలగూడ : బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయకు పుష్పగుచ్ఛం, పండ్లు అందించి ఆత్మీయ సత్కారం చేశారు. సికింద్రాబాద్ మహంకాళి బోనాల జాతరకు హాజరైన ఆయన సోమవారం మధ్యాహ్నం సీతాఫల్‌మండిలోని రాచమల్ల ఇంటికి వచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దత్తాత్రేయతో తన అనుబంధం ఎప్పటినుంచో కొనసాగుతుందని, రాజకీయాలతో పాటు పలు అంశాలపై చర్చించినట్లు రాచమల్ల కృష్ణమూర్తి తెలిపారు.

మూసీ నది ప్రక్షాళన కోసం పాదయాత్ర

సాక్షి,సిటీబ్యూరో: మూసీ నది ప్రక్షాళన చేయాలని సొసైటీ ఫర్ ఎర్త్ జస్టిస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పాదయాత్ర నిర్వహించారు.నగరంలోని తార్‌బండ్ జంక్షన్ నుంచి బోయినపల్లి జంక్షన్ వరకు 2 కిలోమీటర్లు 200 మందితో పాదయాత్ర కొనసాగింది. పాదయాత్రలో పాల్గొన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మూసీ నదిని లండన్ నగరంలోని థేమ్స్ నదిలా మారుస్తామని చెప్పి ఈ విషయమే మరచిపోయారని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ రూ.16 వేల కోట్ల తో మూసి ప్రక్షాళన సుందరీకరణ చేస్తామని అసెంబ్లీ, కౌన్సిల్ సాక్షి ప్రకటించి ఐదేళ్లు దాటుతున్నా ఇప్పటివరకు దాని ఊసే లేకుండా పోయిందన్నారు. నగరంలో నివసిస్తున్న కోటి మంది ప్రజల ఆరోగ్యం గాలి,నీటి కాలుష్యం, దోమల ద్వారా పాడవుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోడం లేదని ఆరోపించారు. ప్రొఫెసర్ వెంకటదాస్ మాట్లాడుతూ మూసీ నది లో పండిస్తున్న కూరగాయలు ఆకుకూరలు తిని నగర ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నాయని, తక్షణమే మూసి ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

కనుల పండువగా ఫలహారపు బండ్ల ఊరేగింపు



ఫలహారపు బండి ఊరేగింపులో పాల్గొన్న మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్



ఫలహారపు బండి ముందు వివిధ రకాల వేషధారణలు

బన్సీలాల్‌పేట్: చరిత్రాత్మక ఉజ్జయినీ మహంకాళి బోనాల వేడుకల్లో రెండవ రోజైన సోమవారం అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపు కనుల పండువగా సాగాయి. లష్కర్ బోనాల వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఫలహారపు బండ్ల ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. డిప్యూటీ స్పీకర్ పద్మారావు, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో టకారబస్తీ, ఆదయ్యనగర్ ఏరియాల నుంచి డప్పుల దరువులు..పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాల నడుమ గొర్రెపోతుల సాయంతో భారీ అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపు బయలుదేరాయి. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావుల ఫలహారపు బండ్ల ఊరేగింపు వెంబడి వందలాది మంది ప్రజలు, యువకులు నృత్యాలు చేస్తూ ముందుకు సాగడం కనిపించింది. మోండా మార్కెట్, ఓల్డ్‌బోయిగూడ, గాస్‌మండి, బన్సీలాల్‌పేట్, రాణిగంజ్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 30కి పైగా అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపు సాగింది. మంత్రి తలసాని ఆధ్వర్యంలో ఆదయ్యనగర్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఫలహారపు బండికి సోమవారం రాత్రి పలువురు ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, మంత్రి సత్యవతి రాథోడ్, కౌన్సిల్ వైస్ చైర్మెన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, సుభాష్ రెడ్డి తదితర పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహంకాళి అమ్మవారితో పాటు 40 దేవాలయాల్లోనూ బోనాల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. రెజిమెంటల్‌బజార్, మోండా, శివాజీనగర్, కళాసీగూడ, రాణిగంజ్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి దేవాలయాల్లో రంగం కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో కోలాహలంగా రెండో రోజు ఉత్సవాలు జరిగాయి. రెజిమెంటల్‌బజార్‌లో జూలేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద జరిగిన అమ్మవారి ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకులు మర్రి రాజశేఖర్‌రెడ్డి, శ్రీగణేష్ పాల్గొన్నారు.



రెజిమెంటల్‌బజార్‌లో ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న శ్రీగణేష్

అందరికి ధన్యవాదాలు.. తలసాని

తెలంగాణలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు సహకరించిన అందరికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జీహెచ్ఎంసీ, పోలీస్, జలమండలి, విద్యుత్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులు ఎంతో శ్రమించి జాతరను విజయవంతం చేశారన్నారు. బోనాలతో వచ్చే భక్తులు వేగంగా అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామని, సాధారణ భక్తులు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని దర్శించుకున్నారని చెప్పారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ముందుకు సాగాలి



సమావేశానికి హాజరైన ముదిరాజ్ నాయకులు

సనత్‌నగర్: రాజకీయ పార్టీలకతీతంగా ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ముందుకుసాగాలని ఆ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. సనత్‌నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు విఠల్ మురళి ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ముదిరాజ్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి చేర్చే ప్రక్రియను వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ముదిరాజ్‌లు సామాజిక, ఆర్థిక, రాజకీయ, వ్యాపార తదితర రంగంలో రాణించాలన్నారు. సనత్‌నగర్‌లో ముదిరాజ్‌లకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు తోట సురేందర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు అంబటి చెన్నయ్య, మధుముదిరాజ్, గోనెల కుమారస్వామి, నాగరాజు, విఠల్ గోపాల్, రవి, నరేష్, సుధాకర్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాజం సంఘటితంగా ఉండాలి



తెలంగాణ నూతన కార్యవర్గ సభ్యులు

లాలాపేట: బ్రాహ్మణ సమాజం సంఘటితంగా ఉంటూ ఎదగాలని తెలుగు తెలంగాణ పురోహిత అర్చక స్టేట్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం లాలాపేటలో సొసైటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా ఆంజనేయ శర్మ, ఉపాధ్యక్షుడిగా పారువెల్ల ఫణికృష్ణ శర్మ, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం కేసీఆర్ బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని, రానున్న రోజుల్లో మరింత చొరవ తీసుకోవాలని కోరారు. తమ ట్రస్టు ద్వారా పేద బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ఎండీ రామకృష్ణ, ఉపాధ్యక్షులు దేవులపల్లి కామేశ్వరశర్మ, రాష్ట్ర నాయకులు సుధాకర శర్మ, ప్రతినిధులు రాళ్లపల్లి రవికుమార్ శాస్త్రీ, చల్ల లక్ష్మీ, హరి నారాయణ, కావ్య, సుక్క గణేష్‌రావు పాల్గొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీకి పదేళ్ల స్వయం ప్రతిపత్తి హోదా

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మరో మైలురాయిని అధిగమించింది. ఏకంగా పదేళ్ల పాటు యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్(యూజీసీ) స్వయంప్రతిపత్తి(అటానమస్) హోదాను సాధించి చరిత్ర సృష్టించినట్లు ఓయూ అధికారులు సోమవారం ఓ పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఇంత సుదీర్ఘకాలం పాటు అటానమస్ హోదా పొందిన కళాశాలలు దేశంలో చాలా అరుదుగా ఉన్నాయని అధ్యాపకులు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1929లో ఏర్పాటైన ఓయూ ఇంజినీరింగ్ కళాశాల గతంలో రెండు పర్యాయాలు ఆరేళ్ల చొప్పున అటానమస్ గుర్తింపును దక్కించుకుంది. తాజాగా ఇది మూడో సారి పదేళ్ల గుర్తింపు దక్కించుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొ. రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఆధునీక కోర్సులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఇంజినీరింగ్ కళాశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ఇటీవలే పనులు ప్రారంభించామన్నారు.

ఆలయ అభివృద్ధికి ముందుకు రావాలి



ఆలయ కమిటీ, బస్తీ నాయకులతో మాట్లాడుతున్న సాయిబాబా

లాలాపేట: లాలాపేట ఇసుకాయి బస్తీలోని అమ్మవారి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ నాగులూరి సాయిబాబా తెలిపారు. ఈ మేరకు సోమవారం తార్నాక డివిజన్ లాలాపేట ఇసుకబాయి బస్తీ వాసులతో సమావేశమై ఆలయం అభివృద్ధితో పాటు బస్తీ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయం అభివృద్ధికి భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు ముందుకు రావాలని కోరారు. బస్తీ అభివృద్ధికి సైతం సహాయం చేస్తానన్నారు. అనంతరం ఆలయం అభివృద్ధికి ఆర్థిక సహాయన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఇసుకబాయి సంక్షేమ సంఘం అధ్యక్షులు గంధమల్ల రాజలింగం, స్వామి, పరమేశ్వర్, నర్సింహ్మా, బల్‌రాం, ప్రభాకర్, శ్రీనువాస్‌యాదవ్ పాల్గొన్నారు.

సాయన్న ఆశయ సాధనే లక్ష్యం



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న లాస్య నందిత

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, సాయన్న కుమార్తె లాస్య నందిత అన్నారు. మోండా డివిజన్ లోహియా నగర్‌లో రూ.6 లక్షల నిధులతో చేపట్టిన బోర్‌వెల్ పనులను ఆమె ప్రారంభించారు. ఇటీవల బస్తీలో పర్యటించగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఈ సందర్భంగా స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా బోర్‌వెల్‌ను మంజూరు చేయించారు. సంబంధిత పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. టీఎస్ శ్రీనివాస్, పనస సంతోష్, సానాది శ్రీనివాస్, నారాయణ్ సురేశ్, రౌతు రాజయ్య, వాజీద్, హరి, ఉమాశంకర్, స్వామి పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయంలో చైర్మన్ పవన్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో సోమవారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ నెల 16వ తేదీన జరిగే బోనాల జాతరను పురస్కరించుకుని అమ్మవారు శాకంబరీ అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిస్తారని, ఉదయం 9 గంటలకు పంచహారతులు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించనున్నట్లు పవన్‌కుమార్ తెలిపారు. డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు సామల హేమ, కందిశైలజ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

లాలాపేట: తార్నాక డివిజన్‌కు చెందిన పలువురు సోమవారం బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఆ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సంక్షేమ పాలనను చూసి అన్ని పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వస్తున్నారన్నారు.

హంసినికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



హంసినికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న డా. చింతపట్ల వెంకటాచారి

లాలాపేట: చిన్న వయస్సులోనే ఓ చిన్నారి కంప్యూటర్‌లో మైక్రో సాఫ్ట్ పెయింటింగ్‌లో 2డీ, 3డీ గ్రాఫిక్స్ సాఫ్ట్‌వేర్ ఉపయోగిస్తూ అద్భుతమైన చిత్రాలను గీస్తూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. నగరానికి చెందిన సత్తు శ్రీధర్-విజయ జ్యోతి దంపతులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరి ఆరేళ్ల కూతురు హంసిని సత్తు పిన్న వయస్సులోనే కంప్యూటర్‌లో బొమ్మలు గీసే అపారమైన మేధా శక్తిని సొంతం చేసుకుంది. తను సొంతంగా కంప్యూటర్‌లో వివిధ రకాలైన 2డీ, 3డీ సాఫ్ట్‌వేర్లను ఉపయోగిస్తూ చిత్రాలను గీయడంతో పాటు వాటి వివరణనూ ఇస్తుంది. అతి చిన్న వయస్సులో కంప్యూటర్‌పై ఇలాంటి అత్యుత్తమ ప్రదర్శనను ఇస్తున్న చిన్నారని హంసిని ప్రతిభను గుర్తించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరును నమోదు చేస్తున్నట్లు సంస్థ చైర్మన్ డా. చింతపట్ల వెంకటాచారి తెలిపారు. సోమవారం లాలాపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బేబి హంసినీకి రికార్డు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

త్రైత సిద్ధాంతం భగవద్గీత జ్ఞాన ప్రచారం

సనత్‌నగర్: ఆషాఢ మాసం గురు పౌర్ణమిని పురస్కరించుకుని బేగంపేట ప్రకాష్‌నగర్‌లో సోమవారం త్రైత సిద్ధాంతం భగవద్గీత జ్ఞాన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భగవద్గీత జ్ఞాన ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు వెంకట్రాముడు మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండడంతో గురుపౌర్ణమిగా నిర్ణయించి శ్రీకృష్ణుడిని మాత్రమే జగద్గురుగా భావించి గురుపూజ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ, మదన్, త్రైతు, లక్ష్మీ, పార్వతమ్మ, వేనమ్మ పాల్గొన్నారు.

బోనాల జాతరలో విద్యుదాఘాతంతో యువకుడి మృతి

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు వచ్చిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కార్వాన్ సబ్జిమండి మోహన్‌సింగ్ గల్లీ ప్రాంతానికి చెందిన ఠాకూర్ ఆకాష్‌సింగ్(25) సికింద్రాబాద్‌లో జరిగే ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాలకు ఆదివారం తన బంధువుతో కలిసి వచ్చాడు. అదే రోజు రాత్రి ఆర్పీరోడ్డులోని సీటీలైట్ హోటల్ చౌరస్తాకు సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో రెండు రోడ్ల మధ్యలో ఉన్న స్ట్రీట్‌లైట్ పోల్‌ను ముట్టుకోవడంతో షాక్ తగిలింది. గుర్తించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

గుడిసెల కూల్చివేత.. స్వల్ప ఉద్రిక్తత



కూల్చిన గుడిసెలను పరిశీలిస్తున్న మన్నె క్రిశాంక్



బాధితులతో మాట్లాడుతున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: ఆరోవార్డు అంబేడ్కర్‌నగర్‌లో రెవెన్యూ అధికారుల కూల్చివేతలతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్ సమీపంలోని బస్తీలో ఆరు గుడిసెలు ప్రభుత్వ స్థలంలో వెలిశాయంటూ బాలానగర్ మండల రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక నేతలు అక్కడికి చేరుకునేలోపే కూల్చివేతలు ముగించుకుని అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఘటనా స్థలికి చేరుకుని బాధితులను పరామర్శించారు. గూడు చెదిరిన రోడ్డున పడ్డామంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేయడంతో సొంతంగా వారికి ఆర్థిక సాయం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి గుడిసె వాసుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే ప్రభుత్వం ద్వారా పేదలకు పట్టాలు ఇప్పించే అవకాశాలను పరిశీలిస్తానన్నారు. వివాదాస్పద స్థలం విషయంలో తిరుమలగిరి, బాలానగర్ మండలాల అధికారులతో సర్వే చేయిస్తామన్నారు. వివాదాస్పద స్థలం కంటోన్మెంట్ పరిధిలోకి వచ్చే క్రమంలో తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సీఈఓ మధుకర్ నాయక్‌ను కోరారు. ఇదిలా ఉండగా కంటోన్మెంట్, కూకట్‌పల్లి నియోజకవర్గాల సరిహద్దుల్లో ఉన్న బస్తీలోని కొంత స్థలంతో పాటు, మరికొంత ప్రభుత్వ స్థలం కబ్జాకు కొందరు యత్నిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే ఈ బస్తీలో పర్యటించిన అధికార పార్టీ నేతలు ప్రభుత్వ స్థల ఆక్రమణ దారులకు జీవో నెంబర్ 59 ద్వారా పట్టాలు ఇప్పిస్తామంటూ హామీ ఇచ్చారు. ఇంతలోనే అధికారులు గుడిసెలు కూల్చివేయడం గమనార్హం.

గుడిసెల తొలగింపు అన్యాయం..

ఆక్రమణల పేరిట అధికారులు నిరుపేదల గుడిసెలు కూల్చివేయడం అన్యాయమని బీఆర్ఎస్ నేత శ్రీగణేశ్ అన్నారు. ఆరోవార్డు అంబేడ్కర్ నగర్‌లో గుడిసెలు కూల్చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఉన్నపళంగా కూల్చివేతలతో తాము రోడ్డున పడ్డామని బాధితులు ఆయనకు మొరపెట్టుకున్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక మాజీ బోర్డు సభ్యుడు పాండుయాదవ్‌లతో కలిసి గుడిసె వాసులకు తగిన న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సదస్సులో మాట్లాడుతున్న వెంకటయ్య

పద్మారావునగర్: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగితేనే మంచి పారిశ్రామికవేత్తలుగా రాణించగలరని పలువురు వక్తలు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కాలేజీలో సోమవారం 'వినూత్న వ్యూహాలు వ్యవస్థాపకత వ్యాపార నిర్వహణ' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునికతను జోడించి ఎంచుకున్న వ్యాపారం కోసం కష్టపడి పని చేయాలన్నారు. ముఖ్యంగా మార్కెట్ అవసరాలను పరిశోధించి అందుకు తగిన విధంగా ఉత్పత్తులను సాగించాలన్నారు. దేశంలో వ్యాపార రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలనే బలమైన సంకల్పం ఉంటే వ్యాపార రంగంలో దూసుకెళ్తారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆచార్య పి. వెంకటయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆచార్య జహంగీర్, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ ఆచార్యులు మహ్మద్ అబ్దుల్ అజీమ్, సదస్సు కన్వీనర్ సీహెచ్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు.

'సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం'



వార్డు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి పేర్కొన్నారు. డివిజన్‌లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అడ్డగుట్ట వార్డు కార్యాలయం ముందు సీపీఐ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఛాయాదేవి మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా డివిజన్ సమస్యలకు కేరాఫ్‌గా మారిందన్నారు. సీ-సెక్షన్‌లో నిత్యం సరఫరా అవుతున్న కలుషిత నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు, అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని, బీ-సెక్షన్‌లో రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యలపై అనేకమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. నిరసనలో కాంపల్లి శ్రీనివాస్, కొమరెల్లి బాబు, యాదగిరి, షేక్ లతీఫ్, రషీద్, నాగరాజు, ఖాసిం, రాములు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



పైప్‌లైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ పలు ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి అధికారులతో కలిసి సోమవారం కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. కిందిబస్తీ, అన్నానగర్, భవానీనగర్, మైలార్‌గడ్డ తదితర ప్రాంతాల్లో చేపట్టిన సీవరేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కిందిబస్తీ, అన్నానగర్, శ్రీనివాసనగర్, ఫ్రైడేమార్కెట్ ప్రాంతాల్లో విస్తరించిన ఓపెన్ నాలా పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించే బోనాల జాతరలోగా అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట జలమండలి డీజీఎం కృష్ణ, సెక్షన్ మేనేజర్ అన్విత్, బస్తీ నాయకులు ఉన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం



రోడ్డు పనులు ప్రారంభించిన రామకృష్ణ

రసూల్‌పురా: బీజేపీ బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా స్థానికులు తెలిపిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ పేర్కొన్నారు. బోర్డు ఎనిమిదవ వార్డు బొల్లారం సదర్ బజార్‌లో బోర్డు నిధులతో చేపట్టే బీటీ రోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. గతంలో బొల్లారం సదర్ బజార్‌లో బస్తీబాట నిర్వహించిన సందర్భంగా స్థానికులు రోడ్డు, డ్రైనేజీ ఇతర సమస్యలు తెలిపారని వారికిచ్చిన హామీ మేరకు బీటీ రోడ్డు పనులు చేపట్టామన్నారు. గత బోర్డు సభ్యుల నిర్లక్ష్యం కారణంగా బొల్లారంలోని పలు బస్తీల్లో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని దశలవారీగా వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, శ్రీకాంత్ జైనపల్లి, సునీల్‌భాగ్‌మార్, బి. వెంకటేష్, జైప్రకాష్, బాల్‌రాజు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం



మార్కండేయశర్మ

చిలకలగూడ : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. పద్మారావునగర్‌కు చెందిన మార్కండేయశర్మ (37) ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో పాటు పార్ట్‌నర్స్ మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన బయటకు వెళ్లిన మార్కండేయశర్మ ఎంతకీ ఇంటికి రాలేదు. సన్నిహితులు, బంధుమిత్రులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి దుర్గానాగేశ్వరరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అధికారులు.. మారదా మీ తీరు!



సనత్‌నగర్: గత నెల రోజులుగా సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ కాలనీలో కలుషిత నీరు సరఫరా అవుతున్నా ఇంతవరకు అధికారులు సమస్య ఎక్కడనేది గుర్తించలేకపోతున్నారు. సమస్య ఓ ప్రాంతంలో ఉంటే మరో ప్రాంతంలో మరమ్మతులు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్ఆర్‌టీ 258 నుంచి 248 వరకు ఇళ్ల నివాసితులకు కలుషితనీరు సరఫరా అవుతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. స్థానికులు ఇక్కడి సమస్యపై ఫిర్యాదు చేయగా (టోకెన్ నెంబర్లు-4456, 1523) ఆయా ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కానీ.. మురుగునీటి సరఫరా కొనసాగుతూనే ఉండడం గమనార్హం.